# ఆనందం

- జి.మేరీకృపాబాయి

కాలింగ్‌బెల్ మోగడంతో లేచి వెళ్లి డోర్ తెరిచాడు శేఖర్.

ఎదురుగా చిరునవ్వుతో రవీంద్ర కనిపించాడు.

"హలో రవీంద్రా! చాలా రోజులకి కన్పించావు లోపలికిరా'' ఆప్యాయంగా ఆహ్వానించాడు శేఖర్.

నవ్వుతూ లోపలకి వచ్చి కూర్చున్నాడు రవీంద్ర.

"ఏమిటి రవీంద్రా! చాలా హేపీగా వున్నట్టున్నావు? ఏమిటి విశేషం?'' ప్రశ్నించాడు శేఖర్.

"విశేషమంటే పెద్దదేం కాదు. ఒక చిన్న విశేషం. నేను కొత్త బండి కొన్నాను. నీకు చూపించాలని తీసుకువచ్చాను'' సంతోషంగా అన్నాడు రవీంద్ర.

"ఓహో అలాగా! రా చూద్దాం'' అంటూ రవీంద్రతో కలసి బయటకి వచ్చాడు శేఖర్.

రవీంద్ర తను కొత్తగా కొన్న హీరోహోండా చూపించి తను ఎక్కడ కొన్నదీ, ఎంతకు కొన్నదీ, తను ఆ బండి కొనడానికి ఎన్ని కష్టాలు పడ్డదీ వివరించి చెబుతున్నాడు.

రవీంద్ర మాటలు వింటుంటే శేఖర్‌కి చాలా ఆశ్చర్యమనిపించింది.

అదే సమయంలో శేఖర్ మరో రకంగా ఆలోచిస్తున్నాడు.

'తను ఇటువంటి బండి ఎప్పుడో ఐదేళ్లక్రితమే కొనేసాడు. తనకు పెద్దమొత్తంలో కట్నం ముట్టినప్పుడే బండి, సెల్‌ఫోన్ కొనేసాడు. రవీంద్ర చిన్నప్పటినుంచీ తనకు స్నేహితుడే. కానీ ఇంత ఆలస్యంగా బండి కొనుక్కుని పైగా చాలా సంతోషపడుతూ తన దగ్గరకు వచ్చి చూపిస్తున్నాడు. చాలా ఆశ్చర్యంగా వుంది' మనసులో అనుకున్నాడు శేఖర్.

"శేఖర్! ఏమిటి ఆలోచిస్తున్నావు? బండి బావుందా?'' అడిగాడు రవీంద్ర.

"చాలా బాగుంది రవీంద్రా'' అన్నాడు శేఖర్.

"సరే ఉంటాను'' అంటూ కొత్త బండి స్టార్ట్ చేసుకుని హుషారుగా వెళ్లిపోయాడు రవీంద్ర.

అతను వెళ్లినవైపే చూస్తుండిపోయాడు శేఖర్. తనూ ఒకప్పుడు కొత్త బండి కొన్నాడు. కానీ తనకి అంత సంతోషంగా అన్పించలేదు. మామూలుగా అన్పించింది. అంతే.

కానీ రవీంద్ర బండి కొనుక్కుని సంతోషంతో ఉప్పొంగిపోతున్నాడు మరోసారి అనుకున్నాడు శేఖర్.

***

మరో ఆరునెలల తరువాత మార్కెట్‌లో రవీంద్రకి శేఖర్ కన్పించాడు.

"హలో శేఖర్! బాగున్నావా? ఈమధ్య నువ్వు కన్పించడంలేదేంటి?'' అంటూ పలకరించాడు.

"ఇంట్లో సమస్యలవలన నేను నిన్ను కలవడం కుదరలేదు'' అన్నాడు శేఖర్.

"ఏమిటి నీకా? ఇంట్లో సమస్యలా? వడ్డించిన విస్తరిలాంటి నీ జీవితానికి కూడా సమస్యలుంటాయా?'' ఆశ్చర్యంగా అడిగాడు రవీంద్ర.

"ఈరోజుల్లో అందరూ కార్లు కొంటున్నారు కదా. నేను కూడా కారు కొందామని ప్లాన్‌వేసి డబ్బు తక్కువగా వుంటే మిగిలినది నా భార్యని పుట్టింటి నుంచి తీసుకురమ్మన్నాను. ఆమెకు కోపం వచ్చి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. మనసంతా చికాకుగా ఉండి ఈ మధ్య బయటకి ఎక్కడికీ వెళ్లలేదు. అందుకే నిన్ను కలవడం కుదరలేదు'' అన్నాడు శేఖర్.

శేఖర్ ప్రవర్తనకు మనసులోనే నొచ్చుకున్నాడు రవీంద్ర.

"నీ విశేషాలేంటి రవీంద్రా! అందరూ బాగున్నారా?'' అడిగాడు శేఖర్.

"ఈమధ్యనే సెల్‌ఫోన్ కొన్నాను శేఖర్. చాలా సౌకర్యంగా కూడా ఉంది చూడు'' అంటూ జేబులోంచి సెల్‌ఫోన్ తీసి శేఖర్‌కు చూపించాడు రవీంద్ర.

రవీంద్ర జేబులోంచి సెల్‌ఫోన్‌ను అపురూపంగా బయటకు తీయడం, అమూల్యమైన వస్తువును అందిస్తున్నట్లుగా శేఖర్ చేతిలో పెట్టడం, దానివైపు రవీంద్ర మురిపెంగా చూడడం శేఖర్‌కు చాలా వింతగా అన్పించింది. శేఖర్ అప్పటికే రెండు మూడు సెల్‌ఫోన్‌లు మార్చడం, వాటికి అంతగా ప్రాముఖ్యత ఇవ్వకపోవడం కూడా జరిగింది.

ఏ వస్తువు కొన్నా రవీంద్ర అంత ఆనందంగా స్వీకరించగలగడం, ఏదీ ఉన్నా తను సంతోషించలేకపోవడం...దీనికి కారణమేమిటో శేఖర్‌కు అంతుపట్టలేదు.

"ఎలా వుంది శేఖర్...మాట్లాడవేం?'' అన్నాడు రవీంద్ర.

"చాలా బాగుంది రవీంద్ర. కంగ్రాట్స్'' అన్నాడు శేఖర్.

***

శేఖర్ ఇంటికి వచ్చాడేగానీ మనసు మనసులో లేదు. తన అశాంతికి కారణం ఏమిటో ఆత్మవిమర్శ చేసుకోసాగాడు.

'తనకు అన్నీ ఉన్నాయి. లేనిదంటూలేదు. తన జీవితం వడ్డించిన విస్తరిలానే వుంది. కానీ వడ్డించిన విస్తరిని ఆస్వాదించడంలో తనకు ఆనందం కలగడంలేదు.

తనకు పెద్దమొత్తంలో వచ్చిన కట్నం డబ్బు, ఆ తరువాత భార్య పుట్టింటి నుంచి నాల్గైదు సార్లు తెచ్చిన డబ్బు అంతా కలిసి తనకు చాలానే ముట్టింది. ఆ డబ్బుతో ఎన్నో సౌకర్యాలు పొందాడు తను. బండి, సెల్‌ఫోన్, ఇంటికి సంబంధించిన ఫర్నిచర్...అంతెందుకు ఇల్లు కూడా ఆ డబ్బుతోనే కొనేసాడు. అయినా తన జీవితంలో ఆనందంలేదు. కారణం ఏమిటి? ఆ రవీంద్రకు తనలా అన్ని సౌకర్యాలు ఉన్నా ఇల్లులేదు. అయినా అతను చాలా ఆనందంగా ఉన్నాడు. తన జీవితంలో ఏదో లోపం వుంది' మనసులోనే బాధపడుతున్నాడు శేఖర్.

***

మరో రెండేళ్లు గడిచాయి. శేఖర్ జీవితంలో ఎటువంటి ఆనందం లేకపోయింది. పైగా శేఖర్ భార్య శేఖర్‌పై అలిగి పదేపదే పుట్టింటికి వెళ్లిపోవడం కూడా జరిగింది.

ఎందుకు తన జీవితంలో ఇంత అశాంతి చోటు

చేసుకుందోనని శేఖర్ బాధపడని రోజులేదు. తన అశాంతి గురించి రవీంద్రతో ఒకసారి చర్చిస్తే బావుంటుందేమోనని అన్పించింది శేఖర్‌కు. రవీంద్రకు ఫోన్ చేయాలని సోఫాలోనుంచి పైకి లేచాడు.

ఇంతలో ఫోన్ మోగిన శబ్దం.

"నేను రవీంద్రను శేఖర్. వచ్చే బుధవారం మా గృహప్రవేశం. నిన్ను ఆహ్వానించడానికి ఇప్పుడే మీ ఇంటికి రావాలనుకుంటున్నాను. నువ్వు వున్నావో లేవోనని ఫోన్ చేస్తున్నాను. ఇప్పుడే వస్తున్నాను" అన్నాడు రవీంద్ర.

"అలాగేరా" అంటూ ఫోన్ పెట్టేసాడు శేఖర్.



'రవీంద్ర బండి, సెల్‌ఫోన్ కొనుక్కుంటూనే చాలా ఆనందపడిపోయాడు. ఇప్పుడు ఇల్లు కూడా కట్టుకున్నాడు. ఇంకెంత సంబరపడిపోతాడో!

అతని జీవితంలో అంత ఆనందానికి, తన జీవితంలో ఇంత నిరాశకు కారణమేమిటో రవీంద్రతో చర్చించాలి. కేవలం ఉద్యోగం మీద వచ్చిన రాబడితోనే రవీంద్ర ఇవన్నీ కొనుక్కోవాల్సి వచ్చింది. అందుకే అన్నీ అంత ఆలస్యంగా సమకూరాయి.

అయినా రవీంద్ర అంత సంతోషంగా ఉండడానికి కారణమేమిటో అతనితోనే చర్చించాలి' అనుకున్నాడు శేఖర్.

ఇంతలో రవీంద్ర రానే వచ్చాడు.

"హలో రవీంద్రా! లోపలకు రా'' ఆప్యాయంగా ఆహ్వానించాడు శేఖర్.

రవీంద్ర లోపలకు వచ్చి శేఖర్‌కు ఇన్విటేషన్ కార్డ్ ఇచ్చి గృహప్రవేశానికి ఆహ్వానించాడు.

అతని ముఖం ఆనందంతో కాంతులు వెదజల్లుతోంది. అతని అపూర్వమైన ఆనందాన్ని వెంటనే గమనించగలిగాడు శేఖర్.

"రవీంద్రా! నీతో ఒక విషయం చర్చించాలి'' అన్నాడు శేఖర్.

"ఏమిటి శేఖర్! చెప్పు'' అన్నాడు రవీంద్ర ఆశ్చర్యంగా.

"నువ్వు బండి కొన్నప్పుడు సంతోషపడ్డావు. నీ ఆనందానికి అవధులు లేకపోయాయి. అలాగే సెల్‌ఫోన్ కొన్నప్పుడు నీ కళ్లల్లో కాంతి నేను గమనించకపోలేదు. ఇప్పుడు ఇల్లు కూడా కట్టుకున్నావు. ఎంతో ఆనందంతో నీ ముఖం తేజోవంతమైంది. కానీ అవన్నీ నాకు ఎప్పటినుండో ఉన్నాయి. కానీ నాలో ఆ ఆనందంలేదు. నా జీవితంలో నిరాశే రాజ్యమేలుతోంది. కారణమేమిటి? నువ్వేమైనా గ్రహించగలిగావా?'' అంటూ ప్రశ్నించాడు శేఖర్.

శేఖర్ మాటలు విన్న రవీంద్ర చిన్నగా నవ్వి "శేఖర్! నీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పగలను. కానీ దానికి నువ్వు నొచ్చుకోకూడదు'' అన్నాడు.

"చెప్పు రవీంద్రా!'' అన్నాడు శేఖర్.

"నువ్వు జీవితంలో పొందుతున్న సౌకర్యాలు, ఆస్తి, అంతస్తు, హోదా ఏవీ నీ కష్టార్జితంకాదు. అవన్నీ నీవు కట్నం రూపంలో పొందినవి. అవన్నీ నీవాళ్లు నీకు ఇష్టపడి బహుమతిగా ఇచ్చినవి కూడా కాదు. భారమైన హృదయంతో అవతలివారు ఇచ్చినవి. అవి నీకు ఉచితంగా రావడంవలన వాటి విలువ నీకు తెలీదు.

అవి నీ కష్టార్జితం కాకపోవడంవలన వాటి వలన నీకు ఆనందం కలగదు. కష్టార్జితంతో సంపాదించిన వాటివలన పొందే తృప్తి, ఆనందం అంతా ఇంతా కాదు. అందువల్లనే నీకు బండి కొన్నా, సెల్‌ఫోన్ కొన్నా, చివరికి పెద్ద బంగళా కొన్నా నీకు ఆనందం కలగదు. పైగా నువ్వు కట్నం తీసుకుని భార్యను పొందావు.

ఆమెకు కూడా నీపై సదభిప్రాయం ఉండదు. ఆమె ప్రేమను నువ్వు పొందలేవు. నీ ప్రేమను ఆమెకు అందించలేవు. మీ ఇద్దరి మధ్యా నువ్వు తీసుకున్న కట్నం అడ్డుగోడలా వుంటుంది. పైగా నువ్వు మాటిమాటికీ నీ భార్యను డబ్బుకోసం వేధించడం, ఆమె బాధపడడం, అలిగి పుట్టింటికి వెళ్లిపోవడం లాంటి విషయాలన్నీ నీకు మనస్తాపాన్నే కలిగిస్తాయిగానీ ఆనందాన్ని పంచలేవు.

అదే నువ్వు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్న వస్తువులైతే వాటి విలువ అపురూపం, అమూల్యం. వాటిని నువ్వు కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటావు. శేఖర్! ఇదే నా అభిప్రాయం'' అన్నాడు రవీంద్ర.

అతడు పొందుతున్న ఆనందానికీ, తన జీవితంలో వున్న నిరాశకీ కారణాలు శేఖర్ గ్రహించగలిగాడు.

"రవీంద్రా! కేవలం నీ కష్టార్జితంతో సంపాదించిన వస్తువులు కొనడంవల్లనే నువ్వు అంత ఆనందాన్ని పొందుతున్నావా?'' ప్రశ్నించాడు శేఖర్.

"తప్పకుండా అంతే. అది అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది. ఊహిస్తే అర్థంకాదు'' అన్నాడు రవీంద్ర ఒక జీవిత సత్యం చెబుతున్నవాడిలా.

రవీంద్ర చెప్పిన విషయాలు శేఖర్ మనసులో బలంగా నాటుకున్నాయి. శేఖర్ ఆత్మవిమర్శలో పడ్డాడు.

'నిజంగానే తను పొరపాటు చేసాడు. తన కష్టార్జితం జల్సా చేసి తన భార్య తెచ్చిన డబ్బుతో అన్ని సౌకర్యాలూ, విలాసాలూ అమర్చుకున్నాడు. కానీ వాటివల్ల తనకు ఆనందం కలగలేదు. పైగా తన భార్యకి తనపై గౌరవం కూడా లేకపోయింది. అందువల్లనే తన జీవితం నిరాశా నిస్పృహలకు లోనయింది. అసలు తను తీసుకున్నది కట్నం కాదు లంచం. భార్యను పోషించడానికి తీసుకున్న లంచం అది. ఇక తనపై తన భార్యకు ప్రేమ ఎందుకుంటుంది? తన జీవితం ఆశల హరివిల్లు ఎలా అవుతుంది? శిశిరం తాండవించిన తన జీవితంలో వసంతాన్ని ఎలా నింపుకోవాలి?' అనుకుంటూ ఆలోచనలో పడిపోయాడు శేఖర్.

## ఆరాటం

గెలుపుకోసం పడే తపన అంతా ఇంతా కాదు. ఏరంగంలోనైనా ఇది మామూలే. అటు తెలుగు, ఇటు హిందీ చిత్రాల్లో నటించి మంచిపేరు, నాలుగు డబ్బులు సంపాదించాలనుకున్న రిచా కోరిక అంతగా తీరినట్టు లేదు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా జనం ముందుకి రాబోతున్న 'రాంగ్‌నెంబర్' బాలీవుడ్ చిత్రం ద్వారా తన చిరకాలవాంఛ నెరవేరుతుందంటోంది. రాకేష్‌బాపట్ హీరో అయిన ఈచిత్రంలో ప్రవీణ్ డబ్బాస్, రింకూఘోష్, యాష్ టాంగ్ తదితరులు నటిస్తున్నారు. మునుపటితో పోలిస్తే తన అందానికి మెరుగులు దిద్దుకున్న ఈభామ ముందు ముందు అవకాశాల్ని ఎలా చేజిక్కించుకుంటుందో చూడాలి మరి!



